క్లుప్తంగా

శనీశ్వర పూజలు

కడప కల్చరల్ : కడపలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో శనివారం శనిత్రయోదశిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోగల నవగ్రహాల్లోని శనీశ్వరస్వామిమూర్తికి ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు తొలి పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నచౌకు రామకృష్ణ నగర్‌లోగల శ్రీ శనీశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వామికి ప్రత్యేకంగా తైలాభిషేకం నిర్వహించారు.

ఘనంగా ఉరుసు

కడప కల్చరల్ : స్థానిక రవీంద్రనగర్‌లోని అస్తానె మురాదియా దర్గా ఉరుసు ఉత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా జమాలుల్లాబాష సాహెబ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పవిత్ర ఖురాన్ పఠనం చేశారు. అనంతరం తన స్వగృహం నుంచి పూలచాందినీతో నగరంలో ఊరేగింపుగా దర్గాకు చేరుకున్నారు. దర్గాలో పీఠాధిపతి ప్రార్థనలు నిర్వహించి గురువుల మజార్‌పై పూలచాందిని అలంకరించారు.

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం

కడప కల్చరల్: దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం మాసోత్సవాల సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులను కనుల పండువగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామిని పల్లకీలో కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.

ఓటు నమోదు చేసుకోవాలి

వైవీయూ : 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కును పొందేందుకు ఓటును నమోదు చేసుకోవాలని కడప ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ శివారెడ్డి సూచించారు. శనివారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 9వ తేదీలోపు ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా శిక్షణ

వైవీయూ : ఎన్‌సీసీ కేడెట్స్ త్వరలో నిర్వహించనున్న ఎన్‌సీసీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా శిక్షణ అందించినట్లు 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా పేర్కొన్నారు. కడప నగరం ఎన్‌సీసీ నగర్‌లో నిర్వహిస్తున్న కంబైన్డ్ ఆన్యువల్ ట్రైనింగ్ క్యాంపులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ డా. ఆర్. నీలయ్య, మహేష్, పొన్నతోట రాజు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప అర్బన్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ సునంద తెలిపారు. ప్రకాశ్‌నగర్–2 ఎస్సీ, సాధుచెంగన్న వీధి ఓసీలకు కేటాయించామన్నారు. అభ్యర్థులు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్: ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరుగనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా మహాధర్నా చేపడుతున్నారన్నారు.

బహుమతుల ప్రదానం

కడప కార్పొరేషన్: రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా రక్షణ స్వచ్ఛంద సంస్థ, సీజేపీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన వారికి డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్ లక్ష్మయ్య, డివిజన్ ఇన్‌చార్జి సుబ్బరాయుడు బహుమతులు ప్రదానం చేశారు. భారత రాజ్యాంగం – డా. బీఆర్ అంబేడ్కర్ పాత్ర అనే అంశంపై స్థానిక గాంధీ నగర్ స్కూల్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

క్యాంపస్ డ్రైవ్‌కు స్పందన

వైవీయూ : కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు విద్యార్థుల నుంచి స్పందన లభించింది. హెటిరో ల్యాబ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ డ్రైవ్‌ను కళాశాల కరస్పాండెంట్ జి. సుబ్బారెడ్డి ప్రారంభించారు. క్యాంపస్ డ్రైవ్‌లో విద్యార్థులను ఇంటర్వ్యూ ఆధారంగా ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు. 25 మంది విద్యార్థులు పలు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

కడప ఎడ్యుకేషన్ : బాలికలు వ్యక్తిగత శుభ్రత్‌పై చాలా అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ హైమావతి తెలిపారు. శనివారం కడప నగర శివార్లలోని కేంద్రీయ విద్యాలయంలో ప్రిన్సిపాల్ మునేష్‌మీనా ఆధ్వర్యంలో 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఉన్న బాలికలతో సమావేశం నిర్వహించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు నెలసరి వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు.

రేపటి సైనికులు

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించి.. దేశసమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ఏర్పాటైన ఎన్‌సీసీ రేపటి సైనికులను దేశానికి అందించే క్రమంలో భాగంగా రాయలసీమ పరిధిలోని పలు జిల్లాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్స్‌కు శిక్షణ ఇస్తోంది. విద్యార్థి దశ నుంచే వారిలో చక్కటి భావాలను నెలకొల్పి వారిని యువసైనికులుగా తీర్చిదిద్దుతోంది. అదే విధంగా ఎన్‌సీసీలో నూతనంగా ప్రవేశపెట్టిన ఓఎంఆర్ విధానంలో పరీక్షల నిర్వహణపై కేడెట్స్‌లో అవగాహన కల్పిస్తోంది. కడప నగరం ఎన్‌సీసీ నగర్‌లో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ క్యాంపుపై ప్రత్యేక కథనం..

- కడపలో శిక్షణ పొందుతున్న వివిధ జిల్లాల ఎన్‌సీసీ కేడెట్స్
- ఎన్‌సీసీ పరీక్షల్లో నూతన మార్పులు
- తొలిసారిగా ఓఎంఆర్ విధానంలో ఎన్‌సీసీ పరీక్షలు



డ్రిల్లు సాధన చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్స్

ఆయుధ శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ కేడెట్స్

కడప స్పోర్ట్స్ : క్రమశిక్షణ, జాతీయ సమైక్యత, నాయకత్వ లక్షణాలు పెంపొందించి ఎన్‌సీసీ కేడెట్స్‌ను ఉత్తమ లక్షణాలు గల యువతగా తయారుచేసేందుకు సామూహిక వార్షిక శిక్షణ శిబిరాలు (కంబైన్డ్ ఆన్యువల్ ట్రైనింగ్ క్యాంపు) వేదికగా నిలుస్తున్నాయి. వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, సత్యసాయి జిల్లాలకు చెందిన బెటాలియన్‌లకు చెందిన ఎన్‌సీసీ జూనియర్ డివిజన్, సీనియర్ డివిజన్‌లకు చెందిన 600 మంది కేడెట్స్ ఈనెల 17 నుంచి కడప నగరం ఎన్‌సీసీ నగర్‌లో శిక్షణ పొందుతున్నారు.

శిక్షణలో ఏమి నేర్పుతున్నారంటే..

30 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో కేడెట్స్‌కు డ్రిల్లు, ఆయుధ వినియోగ శిక్షణ, ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, అడ్డంకులను అధిగమించడంలో మెళకువలు, తక్కువ సమయంలో గుడారాలు సిద్ధం చేసుకోవడం (టెంట్ పిచ్చింగ్), బోయ్‌నెట్ ఫైటింగ్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. మొక్కలు నాటడం, ప్రాథమిక చికిత్స, రక్తదానం, ప్రకృతి విపత్తుల సమయంలో స్పందించే చొరవ, సామాజిక అభివృద్ధిలో భాగస్వామ్యం కావటం వంటి సామాజిక అంశాలను అలవాటు చేస్తున్నారు.

నూతన విధానంలో ఎన్‌సీసీ పరీక్షలు

ఎన్‌సీసీ ఏ, బీ సర్టిఫికెట్ పరీక్షలను 2004లో నూతన విధానంలో నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు వ్యాసరూపంలో నిర్వహిస్తూ వచ్చిన పరీక్షలను ఈ యేడాది నుంచి ఓఎంఆర్ విధానంలో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు సైతం ఎన్‌సీసీ డైరెక్టరేట్ నుంచి బెటాలియన్‌కు అందాయి. క్యాంపులో నూతన పరీక్షా విధానంపై సైతం అవగాహన కల్పిస్తున్నట్లు ఎన్‌సీసీ అధికారులు తెలిపారు. ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్‌కు సంబంధించిన పరీక్షలో ఎలాంటి మార్పులు లేకపోవడం గమనార్హం.

ఎన్‌సీసీతో కలిగే ప్రయోజనాలు

- జాతీయ సమైక్యతను పెంపొందించాలనే ఆలోచన, మంచి నడవడిక అలవడతాయి. త్రివిధ దళాల్లో సైనికులుగా పనిచేయాలనే భావనలు చిగురిస్తాయి. విద్యార్థి సమగ్ర ప్రగతికి ఎన్‌సీసీ దోహదం చేస్తుంది. నాయకత్వ లక్షణాలు అలవడతాయి.
- ఎన్‌సీసీ కేడెట్స్‌కు విద్య, ఉద్యోగాలపరంగా రిజర్వేషన్లు వర్తిస్తాయి. మెడిసిన్, ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏలతో పాటు అన్ని పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఎన్‌సీసీ కోటా ఉంటుంది. ఆర్మీ ఉద్యోగాల్లో కూడా రిజర్వేషన్లుంటాయి.
- ఎన్‌డీఏ వంటి పరీక్షల్లో సీ సర్టిఫికెట్ పొందిన వారికి నేరుగా ఇంటర్వ్యూలకు హాజరయ్యే అవకాశం ఉంది. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన అగ్నివీర్, పోలీసు ఉద్యోగ ఎంపికల్లో సైతం ఎన్‌సీసీ కేడెట్స్‌కు ప్రాధాన్యత కల్పిస్తారు.

లీడర్‌షిప్ అలవడుతుంది



ఖాకీ దుస్తులు ధరించాలన్న నా కల ఎన్‌సీసీ ద్వారా నెరవేరింది. ఎన్‌సీసీలో చేరడం ద్వారా నాయకత్వ లక్షణాలు, జాతీయ సమైక్యత, సామాజిక బాధ్యత అలవడుతుంది. సిద్దిపేటలో నిర్వహించిన నేషనల్ క్యాంపులో పాల్గొన్నా. బీ సర్టిఫికెట్ పాసయ్యాను. సీ సర్టిఫికెట్ పరీక్షకు సన్నద్ధమవుతున్నాను. క్యాంపులో ఇచ్చే శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– పి.వేదభారతి, శ్రీహరి డిగ్రీ కళాశాల, కడప

జాతీయభావం అలవడుతుంది



ఎన్‌సీసీలో చేరడం ద్వారా దేశభక్తి, జాతీయభావం కలుగుతాయి. ఇప్పటి వరకు రెండు జాతీయ క్యాంపుల్లో పాల్గొన్నాను. ప్రతిష్టాత్మకమైన తల్‌సైనిక్ క్యాంపు, ఏక్ భారత్ శ్రేష్ఠభారత్ క్యాంపు పూర్తి చేశాను. సీ సర్టిఫికెట్ సాధించేందుకు ప్రిపేర్ అవుతున్నాను.

– కె. సరిత, ఎన్‌సీసీ కేడెట్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజంపేట, అన్నమయ్య జిల్లా

వివిధ రాష్ట్రాలు తిరిగే అవకాశం లభించింది



ఎన్‌సీసీలో చేరడం ద్వారా నాకు వివిధ రాష్ట్రాలను చూసే అవకాశం లభించింది. పంజాబ్‌లో నిర్వహించిన ఏక్ భారత్ శ్రేష్ఠభారత్ క్యాంపు, సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంపులో పాల్గొన్నాను. చీరాలలో నిర్వహించిన తల్ సైనిక్ ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్ క్యాంపులో పాల్గొన్నా. క్యాంపులో కొత్త విషయాలను ఎన్నో తెలుసుకోగలిగాను.

– జె. అభిరాం, ఎన్‌సీసీ కేడెట్, ప్రభుత్వ పురుషుల కళాశాల, కడప

తొలిసారిగా క్యాంపులో పాల్గొన్నా..



ఎన్‌సీసీ గురించి మా పాఠశాలలో చెబితే చేరాను. తొలిసారిగా ఎన్‌సీసీ క్యాంపులో పాల్గొన్నాను. ఇక్కడ క్యాంపులో సీనియర్లు, జూనియర్లు అందరూ కలిసిమెలిసి ఎంతో క్రమశిక్షణగా శిక్షణ పొందుతున్నారు. ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్‌కు ప్రిపేర్ అవుతున్నాను.

– ఎస్.వర్షిణి, ఫాతిమా హైస్కూల్, బద్వేలు

పరీక్షల్లో వచ్చిన మార్పులపై అవగాహన



ఎన్‌సీసీ ఏ, బీ సర్టిఫికెట్లకు సన్నద్ధమయ్యే ఎన్‌సీసీ కేడెట్స్‌కు పరీక్షల్లో వచ్చిన మార్పులపై సీఏటీసీ క్యాంపులో అవగాహన కల్పిస్తున్నాం. ఎన్‌సీసీ వలన కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నాం. విద్యార్థులు ఎన్‌సీసీలో చేరి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి.

– లెఫ్టినెంట్ డాక్టర్ ఆర్.నీలయ్య, క్యాంపు డిప్యూటీ కమాండెంట్, కడప

జాతీయ సమైక్యతను చాటిచెప్పేలా క్యాంపు..



కడప నగరం ఎన్‌సీసీ నగర్‌లో నిర్వహిస్తున్న సీఏటీసీ–12 క్యాంపులో పాల్గొన్న వివిధ జిల్లాల ఎన్‌సీసీ కేడెట్స్‌కు డ్రిల్లు, ఆయుధశిక్షణ, సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. జాతీయ సమైక్యత, సమగ్రత, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నాం.

– లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా, ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్, 30 ఆంధ్రా బెటాలియన్, కడప

మిల్లెట్ చాక్లెట్స్ తయారీపై శిక్షణ



చాక్లెట్ల తయారీపై అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రత్యూష

కడప అగ్రికల్చర్: అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023 సందర్భంగా ఊటుకూరు ఏరువాక కేంద్రం, వ్యవసాయ సాంకేతిక యాజమాన్యం(ఆత్మ) సహకారంతో ఏరువాక కేంద్రంలో విస్తరణ శాస్త్రవేత్త, ట్రైనింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. రామలక్ష్మిదేవి ఆధ్వర్యంలో చిరుధాన్యాల విలువ జోడింపుపై రైతులకు నైపుణ్య శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నాల్గవ రోజు శనివారం మిల్లెట్స్ చాక్లెట్ల తయారీపై పులివెందుల ఫుడ్ అండ్ టెక్నాలజీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎస్ జన్మాహఫీజా రీసోర్సు పర్సన్‌గా వ్యవహరించి మిల్లెట్ చాక్లెట్లు తయారీపై ప్రయోగాత్మకంగా తరగతులను నిర్వహించారు. అనంతరం పులివెందుల వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రత్యూష చిరుధాన్యాల సాగులో మెలకువలు, చిరుధాన్య పంటలసాగు, విత్తనాలు, లభించే ప్రయోజనాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ మురళీ కృష్ణ, ఆత్మ డీపీడీ పద్మలత, యువ, మహిళా, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

రేనాటి సూర్యచంద్రుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : రేనాటి సూర్యచంద్రులుగా ప్రసిద్ధికెక్కిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి విగ్రహాలను కడప నగరంలోని కూడళ్లలో ఏర్పాటు చేయాలని కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ దేవగుడి చంద్రమౌళేశ్వర్‌రెడ్డి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు కోరారు. శనివారం కడపలో పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసి ఈ మేరకు విన్నవించారు. ఉయ్యాలవాడ గ్రామ వాసి నరసింహారెడ్డి బ్రిటీషు పాలకులకు వ్యతిరేకంగా గొప్ప తిరుగుబాటు చేశారన్నారు. ఇకపోతే 1866లో సంభవించిన అతి పెద్ద కరువులో రాయలసీమ ప్రాంతంలో వేలాది మంది ఆకలితో మరణించారన్నారు. ఆ పరిస్థితుల్లో ఉయ్యాలవాడకు చెందిన బుడ్డా వెంగళరెడ్డి మూడు నెలలపాటు కొన్ని వేల మందికి అన్నదానం చేసి ప్రాణాలు కాపాడారని పేర్కొన్నారు.

ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన



సూచనలు ఇస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

కడప రూరల్: ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ (ఎంసీహెచ్) డాక్టర్ కేవీఎస్ఎస్ అనిల్‌కుమార్ అన్నారు. శనివారం పాత రిమ్స్‌లోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను పరిశీలించారు. ఈ సందర్భంగా ల్యాబొరేటరీ, ఇన్ పేషెంట్స్, ఫార్మసీ విభాగాలను తనిఖీ చేశారు. ఇన్ పేషెంట్స్‌తో పాటు ఇతర విభాగాలకు చెందిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంచి సంకల్పంతో ప్రభుత్వ రంగ వైద్యంను కార్పొరేట్ ఆసుపత్రుల స్థాయికి తీసుకెళ్లిందన్నారు.

పెండింగ్ నిధులను విడుదల చేయండి

కడప కార్పొరేషన్ : సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ బోర్డు నుంచి క్రెచ్ ప్రోగ్రాం కింద పెండింగ్‌లో ఉన్న రూ.3.66కోట్ల నిధులను విడుదల చేయించాలని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్‌కుమార్ కోరారు. శనివారం జిల్లా పర్యటనకు విచ్చేసిన కేంద్రమంత్రి నారాయణస్వామికి ఆయన వినతి పత్రం సమర్పించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు పులి సునీల్ తెలిపారు. అంతకుముందు ఆయన డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డితో కలిసి మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు.

బేడ, బుడగజంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలి


రాష్ట్రంలోని బేడ, బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చి కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని బేడ, బుడగ జంగం హక్కుల పోరాట సమితి నాయకులు పస్తం అంజి కేంద్ర మంత్రి నారాయణ స్వామిని కలిసి వినతి పత్రం సమర్పించారు.

కేంద్ర మంత్రికి సత్కారం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర మంత్రి నారాయణ స్వామిని సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నగర అధ్యక్షులు లయన్ పఠాన్ ఖాదర్‌బాష సత్కరించారు.

వైవీయూ : కేంద్రమంత్రిని ఏబీవీపీ నాయకులు కలిశారు. ఏబీవీపీ కడప విభాగ్ కన్వీనర్ మల్లికార్జున మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో రాజకీయ నాయకుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, దీనిని నివారించాలని కోరారు.

ఇండస్ట్రియల్ విజిట్‌లో 'మను'విద్యార్థులు



పులివెందులలోని ఆదిత్య బిర్లా గార్మెంట్స్‌తో కడప మను పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : కడపలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన అప్పారెల్ టెక్నాలజీ విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా శనివారం పులివెందులలోని ఆదిత్య బిర్లా గార్మెంట్స్ లిమిటెడ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు గార్మెంట్రీ తయారీ పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ మహమ్మద్ షరీఫ్, మొహమ్మద్ సికిందర్ హుస్సేన్, సంస్థ సిబ్బంది దిలీప్, కిషోర్, ఖైరున్నీషాభాను, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు పౌర్ణమి వేడుకలు

కడప వైఎస్సార్ సర్కిల్: నగర శివార్లలోని 45వ డివిజన్ ఊటుకూరు గ్రామంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణంలోని శివాలయంలో సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకంతో పాటు పలు పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రెండు ఇళ్లలో చోరీ

కడప అర్బన్ : కడప నగరంలోని శంకరాపురంలో నివసిస్తున్న శేషగిరిరావు అనే వ్యక్తి ఇంటిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి నాలుగు తులాల బంగారు ఆభరణాలు, రూ. 50 వేలు నగదు ఎత్తుకెళ్లారు. అదే ఇంటి పై భాగంలో మల్లికార్జున అనే వ్యక్తి ఇంటిలో మూడు తులాల బంగారు నగలు, రూ. 10 వేలు నగదు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిన్నచౌక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

29న బీజేపీ పోరుబాట

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈనెల 29వ తేదీన ఉదయం 11 గంటలకు మండల కేంద్రమైన వీఎన్ పల్లెలో సర్వరాయసాగర్‌ను సందర్శించేందుకు పలువురు బీజేపీ నాయకులు వస్తున్నారని బీజేపీ పోరుబాట నిర్వహిస్తున్నదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం కడప నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 25 వేల ఎకరాలకు సాగు, తాగు నీటిని అందించడమే లక్ష్యంగా నిర్మించిన సర్వరాయసాగర్ రైతులకు ఉపయోగపడకుండా పోయిందన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జయరాములు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు కమిటీ రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి రామచంద్రారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణయాదవ్‌లు మాట్లాడారు.

ప్రాణ రక్షణ కల్పించండి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం తిలక్ నగర్‌లో నివాసముంటున్న తమకు న్యాయం చేసి, ప్రాణ రక్షణ కల్పించాలని బాధితులు తమ్మిశెట్టి రేవతి, తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ, లక్ష్మీపార్వతిలు కోరారు. శనివారం పాత్రికేయులతో మాట్లాడారు. తన చిన్నమామ తమ్మిశెట్టి సుబ్బరాయుడు తమపై దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నాడని, తమను చంపడానికి ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. అతనిపై చర్యలు తీసుకొని తమకు ప్రాణరక్షణ కల్పించాలని కోరారు. రిమ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

'ఆర్తీ' కేంద్రంలో నర్సరీ ప్రారంభం

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ స్టేడియం వద్దగల ఆర్తీ ఉమెన్ సెంటర్‌లో శనివారం హోం అధ్యక్షులు పీవీ సంధ్య నర్సరీని ప్రారంభించారు. హార్టికల్చర్ ఏడీ అనిల్‌కుమార్ మాట్లాడుతూ హార్టికల్చర్ ద్వారా ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, వీటిని ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిపుణులు మహిళలకు నర్సరీ పెంపకంలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, ఆర్తీ సంస్థ కార్యదర్శి బి.దుర్గాకుమారి, ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభ పాల్గొన్నారు.

నేడు సాహితీ సదస్సు

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఉదయం 10.00 గంటలకు సాహితీ సదస్సు నిర్వహించనున్నట్లు ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి తెలిపారు. నెలనెల సీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా కొడవలూరు రామచంద్రరాజు మహాసేనోదయం అనే అంశంపై ప్రొద్దుటూరుకు చెందిన విశ్రాంత తెలుగు పండితులు ఏసీ దస్తగిరి ప్రసంగించనున్నట్లు ఆయన వివరించారు.

సీనియర్ బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ

కడప ఎడ్యుకేషన్ : ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం క్రీడా మైదానంలో ఈ నెల 17 నుంచి 19 వరకు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ పురుషులు, మహిళల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో వైఎస్సార్‌జిల్లా జట్టు తరుపున కేఎస్ఆర్ఎం కళాశాల మహిళల జట్టు తృతీయస్థానం కైవసం చేసుకుంది. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల ప్రధానాచార్యులు వీఎస్ఎస్ మూర్తి, కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి అభినందించారు.

- ఏపీ ఇంటర్ స్టేట్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో కేఎల్ఎం విద్యార్థులు రాష్ట్రస్థాయి జట్టులో స్థానం సంపాదించినట్లు ప్రిన్సిపాల్ రత్నమ్మ తెలిపారు.

అయ్యప్పకు వైభవంగా పుష్పాభిషేకం



అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పూజలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

కడప కల్చరల్ : శబరి గిరీశుడు అయ్యప్పస్వామికి శనివారం హౌసింగ్‌బోర్డు కాలనీ రామాలయ ప్రాంగణంలో వైభవంగా పుష్పాభిషేకం నిర్వహించారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న అయ్యప్ప స్వామి ఉత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. భక్తులు సమర్పించిన పలు రకాల పూలతో పాటు నిర్వాహకులు సమకూర్చిన పూల రాశులతో అయ్యప్ప ఉత్సవ మూర్తికి పుష్పయాగం చేశారు. ధార్మికవేత్త వేదవ్యాస్ అయ్యప్ప గురించిన పలు ఆసక్తికరమైన విశేషాలను తెలిపారు. ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గాయక బృందం కార్యక్రమం జరుగుతున్నంత సేపు అయ్యప్ప శరణు గీతాలను ఆలపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఖైదీల ఆరోగ్యంపై అప్రమత్తంగా వుండాలి



మాట్లాడుతున్న జడ్జి ప్రదీప్‌కుమార్

కడప అర్బన్ : మహిళా ఖైదీల ఆరోగ్య విషయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్ అన్నారు. శనివారం కడప నగర శివార్లలోని ప్రత్యేక మహిళా కారాగారంను జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్ తమ సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం, న్యాయసహాయం రక్షణ సలహా వ్యవస్థను గురించి తెలుసుకోవాలన్నారు. పారాలీగల్ వాలంటీర్‌లు, లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు, విధి విధానాలను తెలియజేశారు. ఆరోగ్య విషయాల పట్ల అప్రమత్తంగా వుండాలనీ వైద్యాధికారికి సూచించారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ గురించి తెలియజేశారు. ఏవైనా సమస్యలుంటే కడపలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక మహిళా కారాగారం సూపరింటెండెంట్ కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఆహార ఉత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ సాగుతో పండించిన దిగుబడులతో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కడప అగ్రికల్చర్ : పురుగుమందులు, రసాయనిక ఎరువులులేని ప్రకృతి వ్యవసాయ ఆహార ఉత్పత్తులే ప్రజలకు ఆరోగ్యం అని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు పేర్కొన్నారు. శనివారం కడపలోని రైతుబజార్‌లో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సహకారంతో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల నూతన విక్రయశాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి స్థాయిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన ఆహార ఉత్పత్తులను పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో ఈ విక్రయశాల ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీడీఎం వసంతకుమారి, జూనియర్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ చంద్ర మౌళీశ్వరరెడ్డి, ఎన్ఎఫ్ఏ శ్రీనాథరెడ్డి, మాస్టర్ ట్రైనర్ కృష్ణారెడ్డి, ఆదినారాయణ, ఓబయ్య, మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కార్తీక దీపోత్సవం

కడప కల్చరల్ : శ్రీ పుష్పగిరి తీర్థ ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం కార్తీకశుద్ధ పౌర్ణమి సందర్భంగా పుష్పగిరి కొండపై కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు సట్టి భారవి తెలిపారు. సాయంత్రం పుష్పగిరి క్షేత్ర పీఠాధిపతులు శ్రీ విద్యా శంకర భారతి స్వామి ఆధ్వర్యంలో కొండపై తొలిసారిగా కార్తీక దీపాన్ని వెలిగిస్తామని తెలిపారు.

నేడు సెమీ క్రిస్మస్

కడప కల్చరల్ : రెడీమర్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6.00 గంటలకు సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు వాక్య పరిచర్యకులు డాక్టర్ బి.సుధీర్ తెలిపారు. నగరంలోని నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో ప్రత్యేక కూడిక, వాక్య సందేశం, ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయన్నారు. అనంతరం ప్రత్యేకంగా క్రిస్మస్‌పాటల ఆలాపన నిర్వహిస్తామన్నారు.